సరస్వతి నిలయాల్లో సమస్యల స్వాగతం

- అసౌకర్యాల నడుమ విద్యార్థుల చదువులు
- నేటి నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి కారణంగా స్కూల్ భవనాలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ నుంచి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో మాత్రం కానరావడం లేదు.



మూడేళ్లయినా పూర్తికాని యడవల్లి స్కూల్ భవనం



అసంపూర్తిగా న్యూలక్ష్మీపురం పాఠశాల భవనం

ముదిగొండ: మండలంలోని 36 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఐదు యూపీఎస్‌లు, 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,082 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అదనపు తరగతి గదులు నిర్మాణంతో పాటు, స్కూల్ భవనాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు..

బాణాపురం, వల్లబి, పమ్మి, ముత్తారం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమలాపురం పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులకు చెట్లకిందనే విద్యాబోధన సాగిస్తున్నారు. బాణాపురంలో అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాలు తొలగించినా అదనపు గదుల నిర్మాణం చేపట్టలేదు. ఒక్కో గది నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరయ్యాయి.

చెరువును తలపిస్తున్న పాఠశాలలు..

న్యూలక్ష్మీపురం, కమలాపురం, మేడేపల్లి, యడవల్లి, వల్లబి జెడ్పీ పాఠశాలల ఆవరణల్లో వర్షాకాలంలో వరదలకు నిండి వాగుల్లా కనిపిస్తున్నాయి. వేసవి సెలవుల్లోనైనా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు తీర్చాల్సి ఉన్నా కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఫలితంగా ఈఏడాది నూతన విద్యా సంవత్సరానికి విద్యార్థులకు సమస్యల స్వాగతం పలుకుతున్నాయి. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్కూల్ భవనాలు, అదనపు తరగతి గదులు పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు.

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం..



యడవల్లిలో మూడేళ్ల నుంచి అసంపూర్తిగా ఉన్న గదులు, కాంట్రాక్టర్‌కు బిల్లులు అందక పనులు చేపట్టలేదని, మిగిలినవి అమ్మా ఆదర్శ పాఠశాలలు, మన ఊరు – మన బడి పథకాల్లో భాగంగా పూర్తి అయ్యాయి. అక్కడక్కడ కొన్ని మిగిలిపోగా.. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొంటాం. – రమణయ్య, ఎంఈఓ, ముదిగొండ

క్లుప్తంగా

భగవద్గీత పోటీల్లో సునీతకు బంగారుపతకం

వైరా: ఇటీవల శృంగేరీ పీఠం వారు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో వైరాకు చెందిన దోనేపూడి సునీత ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతిగా బంగారు పతకం సాధించింది. ఈ పోటీలో నిర్వాహకులు 730 శ్లోకాలు ఎక్కడ అడిగితే అక్కడ కంఠస్థంగా చెప్పినందుకుగాను బహుమతి లభించింది. దీంతో ఆమెను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

ముగిసిన సీపీఎం శిక్షణా తరగతులు

బోనకల్: మండలంలోని చిరునోములలో ప్రజా సమస్యలపై నిర్వహించిన సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడారు. రాజకీయ శిక్షణా తరగతుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాల్‌రావు, ఐదు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెనపై ఆర్టీసీ బస్సును వెనుక నుండి లారీ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సత్తుపల్లి డిపో డీలక్స్ బస్సు ప్రయాణికులతో వైరా వస్తుండగా తల్లాడ వైపు వెళ్తున్న లారీ హైలెవల్ వంతెనపై వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనుక అద్దం ధ్వంసం కాగా ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, ప్రమాదంలో వంతెనపై వాహనాలు నిలిచిపోగా ఎస్సై పుష్పాల రామారావు సిబ్బంది చేరుకుని లారీ, బస్సు తీయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన అయితం కల్పనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్పన పాతకక్షలతో తురక సూజాతతో మంగళవారం ఘర్షన పడి కర్రతో కొట్టగా.. చేతికి గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగులమీరా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో కాలిపోయిన ఉపకరణాలు

కల్లూరు: కల్లూరులో బుధవారం తెల్లవారుజామున వర్షం కురుస్తుండగా పిడుగు పడింది. ఎన్నెస్పీ కాలనీలోనిఎబినేజర్ ఇంటి సమీపాన పిడుగు పడడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో ఇంట్లోని ఏసీ, ల్యాప్‌టాప్, టీవీ, వాషింగ్ మిషన్ తదితర విద్యుత్ ఉపకరణాలు, దుస్తులు కాలిపోయాయి. ఈక్రమాన స్థానికులు చేరుకుని మంటలు ఆర్పారు.

అండర్-19 క్రికెట్ జట్టుకు కిషన్‌రాజు ఎంపిక



కిషన్‌రాజు

మధిర: మధిర మండలం ఆత్కూరుకు చెందిన పెరుమాళ్లపల్లి కిషన్ రాజు క్రికెట్ అండర్–19 జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 9న ఖమ్మం పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొనగా, మధిర డివిజన్ నుంచి కిషన్‌రాజుకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా కిషన్ రాజును శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ అధినేత బి.అంజన్ బాబు తదితరులు అభినందించారు.

మాది చేతల ప్రభుత్వం..



సత్తుపల్లిటౌన్: కొమ్మేపల్లి కాలనీలో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

సత్తుపల్లిటౌన్/వేంసూరు: మాది.. మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం పట్టణంలోని సింగరేణి, కొమ్మేపల్లి కాలనీలలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. 15 రోజుల క్రితం ఆ కాలనీ సందర్శించిన ఎమ్మెల్యేకు సమస్యలు చెప్పటంతో వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం తుంబూరులో భూభారతి చట్టం అవగాహన సదస్సులో, అదే విధంగా వేంసూరులోని లింగపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. లింగపాలెంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. కార్యక్రమంలో దయానంద్, ఆనంద్, కమల్‌పాషా, చెన్నారావు, సామేలు, తహసీల్దార్ సత్యనారాయణ, రామారావు, ఉద్యోగులు, సోమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

వేంసూరు/ఏన్కూరు: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏన్కూరు హెచ్‌ఎం కూరకుల సైదయ్య తెలిపారు. బుధవారం వేంసూరు, ఏన్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్మికులు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ, నాణ్యమైన తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, గోపి, వెంకటప్పయ్య, హతీరామ్, రామ్‌చందు, వెంకటేశ్వర్లు, నిర్మల్‌కుమార్, రామకృష్ణ, చంద్రిక, మాధవి, దివ్య, నరసింహారావు, ఆదాంబీ, మాణిక్ చంద్, రమాదేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కొణిజర్ల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య తెలిపారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలపై ఎంపీఓ డి.రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కుంటు పడ్డాయని, అడిగితే నిధులు లేవంటున్నారని తెలిపారు. దీంతో స్పందించిన ఎంపీఓ రాజేశ్వరి.. జీపీ కార్యదర్శులే సొంతంగా ట్రాక్టర్లకు డీజిల్ పోయించి తిప్పుతున్నారని, ఇక ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. నాయకులు సుధాకర్, కృష్ణార్జునరావు, చల్లానారాయణ, ప్రసాద్, అఫ్జల్ పాల్గొన్నారు.

జవాన్‌కు సన్మానం

కారేపల్లి: కారేపల్లి శ్రీవెంకటసాయినగర్ కాలనీకి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ జారె రవికుమార్.. ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం 'ఆపరేషన్ సింధూర్'లో పాల్గొని, పంజాబ్ సరిహద్దుల్లో పాకిస్తాన్ ముష్కరులతో యుద్ధం చేసి, విజయవంతంగా సెలవులపై ఇంటికి వచ్చాడు. కాగా, బుధవారం శ్రీవెంకటసాయినగర్ కమిటీ ఆధ్వర్యంలో జవాన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటసాయినగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, భాస్కర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, రాంబాబు, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదల పక్షాన పోరాడేది 'సీపీఐ'

బోనకల్/కొణిజర్ల: గత వందేళ్లుగా నిరంతరం పేదల హక్కుల సాధనకై పోరాడేది సీపీఐ పార్టీయేనని సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, అమరుల స్మారక స్థూపానికి.. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి లతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోగా.. మండల కార్యదర్శిగా కలకోట గ్రామానికి చెందిన యంగల ఆనందరావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా కొణిజర్ల మండలంలోని కొత్త కాచారం గ్రామంలో బండారుపల్లి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామశాఖ మహాసభలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా బాబు పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచండి



వైరా: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

వైరా/పెనుబల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంఈఓలు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎస్.సత్యనారాయణ తెలిపారు. బుధవారం వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పెనుబల్లిలోని వీయంబంజర్‌లో నిర్వహించిన స్కావెంజర్ల అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రిసోర్స్ పర్సన్ యన్‌వీహెచ్.ప్రసాద్, దీపిక, రామారావు, రాము పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు..

సత్తుపల్లిరూరల్: ఎరువులు, హానికర రసాయనాలు మోతాదుకు మించి వాడొద్దని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ అన్నారు. బుధవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, సత్తుపల్లి వ్యవసాయశాఖ సహకారంతో సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామాల్లో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల'కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వినుకొండ కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ ఆశాజ్యోతి, గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు..

మధిర: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మధిర ఏడీఏ విజయచంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేసి.. స్టాక్ రిజిస్టర్, ఫార్మర్ సేల్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్వాయిస్, జీఓటీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ అధికారి సాయి దీక్షిత్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ డాక్టర్ శీలం పాపారావు తెలిపారు. బుధవారం సత్తుపల్లిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గురువారం పట్టణంలోని జెకన్వెన్షన్ హాల్‌లో వికసిత్ భారత్‌పై మేథోమదన సదస్సుకు అందరు హాజరు కావాలన్నారు.

మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా అంజయ్య

చింతకాని: మండల కేంద్రంలో బుధవారం మున్నూరుకాపు నూతన కమిటీని ఎన్నుకోగా.. మండల అధ్యక్షుడిగా మత్కేపల్లికి చెందిన తిరుపతి అంజయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొడవటికంటి మురళీకృష్ణ, మహిళా మండల అధ్యక్షురాలిగా చింతకాని గ్రామానికి చెందిన ధర్మపురి విజయలక్ష్మి, కార్యదర్శిగా తిరుపతి తులసి ఎన్నికయ్యారు. మండల కమిటీతో పాటు గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు.

బోనకల్ అధ్యక్షుడిగా కొండలు..

బోనకల్: మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సాదం కొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మేకల శరత్, కార్యదర్శిగా నర్సింశెట్టి నరేష్, సహాయ కార్యదర్శిగా నిమ్మల ఉపేందర్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాలల హక్కులపై ప్రచారం

బోనకల్: మండలంలోని గోవిందాపురం గ్రామంలో చైల్డ్ రైట్స్ అండ్ యూ స్వచ్ఛంధ సంస్థ సభ్యులు ముత్తారపు కరుణ, ఎస్‌కే లాల్‌బీ బాలల హక్కులపై బుధవారం ప్రచారం నిర్వహించారు.

కళాశాల భవన మరమ్మతు పనులు ప్రారంభం

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన మరమ్మతులకు సింగరేణి కాలరీస్ సంస్థ యాజమాన్యం రూ.30లక్షల నిధులను మంజూరు చేయటంతో.. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ నోముల విజయకుమారి పనులను ప్రారంభించి మాట్లాడారు. సమస్యను వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన చొరవతో సింగరేణి యాజమాన్యం నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోనే అత్యధికంగా కారేపల్లి ప్రభుత్వ కళాశాలలో 110మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

సత్తుపల్లిరూరల్: 0–5 సంవత్సరాల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలలో బుధవారం జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారా రాణి, రామారావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలి

మధిర: తెలంగాణ మంత్రి వర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని జామియా మసీదులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గం నుంచి పక్కన పెట్టడం బాదకరమన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని వెంటనే పరిగణనలోకి తీసుకొని సత్వర నిర్ణయం తీసుకోకపోతే ముస్లిం సమాజం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు.

వినతుల వెల్లువ..

ఎంఈఓకి వినతి

ముదిగొండ: మండలంలోని అన్ని పాఠశాలలకు సరిపడా పుస్తకాలు అందించాలని కోరుతూ.. టీఎస్ యూటీఎఫ్ బృందం ఎంఈఓ రమణయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పి.సురేష్, ఎస్‌కే జహీర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై తహసీల్దార్‌కు..

కొణిజర్ల: పంటల బీమా సౌకర్యం కల్పించాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరుతూ.. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్లు రాము, రమాదేవికి వినతులు అందించారు. కొణిజర్లలోని లాలాపురంలో, బోనకల్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతు సమస్యలపై వినతులు అందించి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, నాయకులు రమేష్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, రమేష్, ప్రసాద్, నరసయ్య, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని..

సత్తుపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడునెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై.. మండల విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవయ్య, రామారావు, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకమ్మ, మహాదేవ లక్ష్మి, పాదిలి సావిత్రి, జరీనా, సీత, షేక్ రహీమున్నీసా, సత్యవతి, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, స్కావెంజర్స్ యూనియన్ నాయకురాలు పాల్గొన్నారు.

సన్మానం..

ఎర్రుపాలెం: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పరిమి ఝాన్సీ పదవీ విరమణ చేయగా.. ఆమెకు స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం సన్మానించారు. ఏసీడీపీఓ జి.కృష్ణశ్రీ, సూపర్‌వైజర్ సరితలు ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కృష్ణకుమారి, మేరికాంతం, నాగమణి, రాజేశ్వరి, ఉమామహేశ్వరి, మాధవి, మహాలక్ష్మి, తదితరులున్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని అంజనాపురం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బీజేపీ గిరిజన నాయకుడు తేజావత్ బాలాజీ నాయక్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు శీలం పాపారావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగులు, జిల్లా నాయకుడు రాజేష్, ఖమ్మం పట్టణ అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.